క్లుప్తంగా

అంగన్‌వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి తదితరులు

టెక్కలి: టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. టెక్కలి, పాతపట్నం, కొత్తూరు ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మేరీ కేథరిన్ పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐసీడీఎస్ పీవోలు శోభారాణి, విమలారాణి, విమలకుమారి ఉన్నారు.

పలాస: పలాస ఆర్డీవో కార్యాలయంలో గిరిజన ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయ కార్యకర్తల పోస్టుల భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలాస మండలంలో మూడు, మందసలో ఏడు, సోంపేట మండలంలో ఒక పోస్టుకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఆర్డీవోజీ.వెంకటేష్, సడీడీపీవో పార్వతీ, శాంతిప్రియ పాల్గొన్నారు.

మార్చి 8న లోక్‌అదాలత్



న్యాయవాదులతో మాట్లాడుతున్న సివిల్‌జడ్జి ప్రసన్నలత

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టు అవరణలో మార్చి ఎనిమిదో తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత కోరారు. కోర్టు అవరణలో న్యాయవాదులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, దంపతులు, ఇతర కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో న్యాయవాదులు లఖినేని శ్రీనివాస్, పి.వాసుదేవరావు, అప్పలనాయుడు, వెంకటరమణ ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం



భూమిపూజ చేస్తున్న జోగారావు

సోంపేట: పలాసపురం పంచాయతీ తరఫున గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తామని సర్పంచ్ తడకజోగారావు అన్నారు. పంచాయతీ నిధులతో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్న బోరుబావి పనులను మంగళవారం ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు పోలాకి రమణ, సచివాలయ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సారా, మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్ట్

కంచిలి: సారా, మద్యం కలిగి ఉన్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోలీసులు మంగళవారం తెలిపారు. మండలంలోని జలంత్రకోట పంచాయతీ పరిధి మధుపురం గ్రామానికి చెందిన తలగాన లోకేశ్వరరావు వద్ద 300 నాటు సారా ప్యాకెట్లను అతని ఇంటి వద్ద, బొగాబెణి పంచాయతీ పరిధి కుమ్మరిపేట గ్రామానికి చెందిన సాహుకారి కుమార్ వద్ద పది మద్యం బాటిళ్లను పోలీసులు దాడిచేసి పట్టుకొన్నారు. ఈ సరకును సీజ్‌చేసి, ఇద్దరిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు స్థానిక ఏఎస్సై పి.అప్పలరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 20వ వార్డులో ఉన్న ప్రభుత్వ పోరంబోకు స్థలాలను కొంతమంది వ్యక్తులు ఆక్రమిస్తున్నారని స్థానిక నాయకుడు అంబటి ఆనందరావు ఆరోపించారు. ఈ మేరకు పలాస తహసీల్దార్ కళ్యాణచక్రవర్తికి మంగళవారం ఫిర్యాదు చేశారు. పట్టణం మధ్యలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పక్కా ఇళ్లు నిర్మించుకున్నారని.. తక్షణమే చర్యలు చేపట్టాలని వినతిలో కోరారు. అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తప్పుడు సర్వేనంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే విషయమై 20వవార్డు వార్డు వీఆర్వో జుబేర్‌కు కూడా వినతిపత్రం అందజేశారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

కంచిలి: మండలంలోని నువాగడ పంచాయతీ పరిధి నువాగడ కాలనీ, తుట్బాసాయి గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులతో సిమెంటు రోడ్లను నిర్మిస్తున్నారు. ఈ పనులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. నువాగడ కాలనీలో 130 మీటర్ల రోడ్డును రూ. 4.5 లక్షలతో, తుట్బాసాయిలో 30 మీటర్ల రోడ్డును రూ.1.2 లక్షలతో నిర్మించనున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబితా గొమాంగో, ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యవతి పండా, వైఎస్సార్‌సీపీ నేతలు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, స్థానిక నేతలు ఋషికేష్ భుయా, భయ్యా గొమాంగో, నీలా భుయ ఉన్నారు.

రబీ పిలుస్తోంది..

- వరి సాగు పనుల్లో అన్నదాత బిజీ
- సన్నరకాల సాగుపై ఆసక్తి



సిద్ధం చేసిన నారుమడి



బొరివంకలో వెదజల్లే పద్ధతిలో సన్నరకం వరి సాగు చేసిన వ్యవసాయక్షేత్రం

కవిటి: సోంపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది రబీ సీజన్‌లో ఫైన్‌క్వాలిటీ (సన్నరకాలు) వరిసాగు పట్ల అన్నదాత ఆసక్తి చూపుతున్నారు. కవిటి ఉద్దానం, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో సుమారు 500 ఎకరాల్లో వరిసాగుకు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. వరిలో పెట్టుబడులు పెరిగిపోతున్నప్పటికీ సాగుపై ఉన్న మమకారంతో ముందుకు సాగుతున్నారు. కపాసుకుద్ది, పుటియాదళ, జగతి, బెజ్జిపుట్టుగ, బొరివంక, మాణిక్యపురంలో రైతులు వరిసాగులో నిమగ్నమై ఉన్నారు. సంప్రదాయసాగులో నాట్లు వేయడంతో పాటు ఆధునిక నాట్లు వేసే విధానాన్ని సైతం అవలంబిస్తున్నారు. బీల ప్రాంతంలో కొంతమంది రైతులు డ్రమ్‌సీడర్‌తో, వెదజల్లే విధానంలో వరిసాగుకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రధానంగా ఈ ఏడాది కవిటి ఉద్దానం ప్రాంతంలో కేఎస్‌ఎం-1638, ఆర్‌ఎన్‌ఆర్-15048, ఎన్‌ఎల్‌ఆర్-3444 రకాల సాగుపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. వాస్తవానికి చిత్తడి నేలల స్వభావం కలిగిన కవిటి మండలంలో ప్రధానంగా నీటి తేమ అధికంగా ఉండే పరిస్థితులే అధికంగా ఉన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ చివరిలో కురిసిన వర్షాలు భూగర్భ జలాల పెరుగుదల కనిపించింది. ఆరుతడి పంటలకు ఈ పరిస్థితులు అనుకూలంగా లేవు. ఈ నేపథ్యంలోనే అభ్యుదయ రైతులు సన్నరకాల సాగు పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అధిక మొత్తాలు వెచ్చించి కూడా ఈ వరి విత్తనాలు తీసుకురావడం విశేషం. సన్నరకాలు సాగుచేస్తే మిల్లర్లు సైతం నేరుగా వచ్చి అధిక ధరలకు కొనుగోలు చేసేందుకు సహజంగానే ఆసక్తి చూపుతున్నారు. దీంతో నీటి వనరులు ఉన్న చోటు రబీ వరిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

ఎరువులు సిద్ధంగా ఉన్నాయి



సోంపేట సబ్‌డివిజన్ పరిధిలో అధికంగా ఈ ఏడాది రబీలో సన్నరకాలైన వరిపంటల్ని సాగు చేయడంలో రైతులు ఆసక్తి కనబర్చడం ఆనందదాయకం. ఆధునిక వంగడాల సాగుపట్ల వారంతా వ్యక్తిగత శ్రద్ధ చూపిస్తున్నారు. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట పీఏసీఎస్ కేంద్రాల్లో డీఏపీ, యూరియా ఎరువుల్ని అందుబాటులో ఉంచాము. రైతులు సద్వినియోగపర్చుకోవాలి.

– పి.జగన్మోహనరావు, ఏడీఏ, సోంపేట

తెలంగాణ నుంచి విత్తనాలు



రబీ వరిసాగు సన్నరకాలతో సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందన్న వ్యవసాయశాఖ నిపుణుల సూచన మేరకు కేఎస్‌ఎం-1638 రకం వరి విత్తనాలను తెలంగాణ ప్రాంతం నుంచి తీసుకువచ్చాను. మూడు ఎకరాల్లో సాగు చేస్తున్నాను. విత్తనాలు, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చుల కోసం రూ. ఆరు వేలు వెచ్చించాం. ప్రకృతి అనుకూలిస్తే బాగుంటుందని భావిస్తున్నాం.

– గున్న సురేష్, రైతు, బొరివంక

మూడు ఎకరాలు వేశాం



కూలీల ఖర్చులు, ఎరువుల ధరలు ఇతరత్రా ఖర్చులు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఆశించిన మేర దిగుబడులు రావడం లేదు. ఈ నేపథ్యంలో ఆర్‌ఎన్‌ఆర్-15048 వరి రకాన్ని వెదజల్లే పద్ధతిలో వేశాను. అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఈ ఏడాది ఈ విధానాన్ని అనుసరించాను.

– బాలక తేజేశ్వరరావు, రైతు, బిగొనువపుట్టుగ

విద్యార్థులకు అభినందనలు..



మందస మండలం సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అల్లిమెరక గ్రామ పాఠశాలలో జరిగిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చారు. బాడ శ్రీజ, మట్ట హర్ష, జె.నిహారిక, వై.రూప్‌కుమార్, ఎస్.చందులు బహుమతులు సాధించడంతో వారిని మంగళవారం అభినందించారు. ప్రధానోపాధ్యాయులు సుందరసాల్మాన్ తదితరులు పాల్గొన్నారు. – కాశీబుగ్గ

పంచరత్నకీర్తన గళార్చన



సంగీత సరస్వతి ముద్దుబిడ్డ త్యాగరాజ స్వామి 178వ ఆరాధన ఉత్సవాలు జల్లుపుట్టుగలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్ద పండి దేవేంద్రమూర్తి తదితర కళాకారులు త్యాగరాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలిఘటించారు. ఉద్దానానికి చెందిన ప్రముఖ కళాకారులంతా ఆంజనేయస్వామి ఆలయ సన్నిధిలో త్యాగరాజస్వామి పంచరత్నకీర్తనల గళార్చనను వీనులవిందుగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. – కవిటి

అవగాహన ర్యాలీ..



ఇచ్ఛాపురం మండలంలో పైలట్ గ్రామమైన పాయితారిలో మంగళవారం మండల రెవెన్యూశాఖ రీ-సర్వే గ్రామ సభ, అవగాహన ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్.వెంకటరావు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రైతులకు సంబంధించి సమస్యలు, చేర్పులు మార్పులు, తొలగింపులు, నమోదు చేస్తున్నట్టు చెప్పారు. రీ-సర్వేతో రైతుల సమస్యలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

ఆస్పత్రులపై దృష్టి సారించాలని విజ్ఞప్తి



కృష్ణబాబుతో మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల తీరుపై దృష్టి సారించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలో హెల్త్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబును మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రిలో సరిపడా వైద్యులు లేరని, జనరేటర్ సదుపాయం లేదని, బారువ సామాజిక ఆస్పత్రిలో నాబార్డు నిధులు రూ.655 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి చివరి దశలో నిలిచి పోయిందని పూర్తి చేయాలని, ఇచ్ఛాపురం, బారువ సామాజిక ఆస్పత్రుల్లో కిడ్నీ రోగుల కోసం డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యతలేని సాంబారు, రుచి లేని ఉప్మా

- అన్న క్యాంటీన్‌లో పరిస్థితి
- మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన ప్రజలు



అన్న క్యాంటీన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: అన్న క్యాంటీన్‌లో రుచిలేని ఉప్మాను పెడుతున్నారని, కనీస నాణ్యత పాటించక రుచిలేని సాంబారు సరఫరా చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం కాశీబుగ్గలోని అన్న క్యాంటీన్‌కు సందర్శించిన మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్ల కోసం అధికంగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, మంచినీరు, శానిటేషన్, విద్యుత్ సౌకర్యం ఉండేలా నిర్వాహకులు శ్రద్ధ చూపాలని కోరారు. ఉదయం పూట టిఫిన్ పెడుతున్న తీరుపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. ఇక్కడ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అన్న క్యాంటీన్ నోడల్ అధికారి డి.ప్రభాకర్ ఉన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో శ్రీకంచమ్మతల్లి క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరుగుతుంది. మంగళవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. ఉదయం డీజీపీ 11ఎస్-కంచిలి టీచర్స్ టీంల మధ్య జరిగిన మ్యాచ్‌లో డీజీపీ 11ఎస్ జట్టు 7.3 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 70 పరుగులు చేయగా, కంచిలి టీచర్స్ టీం జట్టు ఎనిమిది ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసి ఓటమి చెందారు. మధ్యాహ్నం బారువ- డైనో ఎక్స్‌ఎల్ సోంపేట జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బారువ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 88 పరుగులు చేయగా, డైనో ఎక్స్‌ఎల్ సోంపేట జట్టు ఆరు ఓవర్లలో 33 పరుగులు చేసి ఆలౌట్ అయ్యి ఓటమి చెందారు.

పంచాయతీలకు ట్రాక్టర్ల పంపిణీ



ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్న విప్ అశోక్

కవిటి: కపాసుకుద్ది, నెలవంక, మాణిక్యపురం, లండారిపుట్టుగ, సహలాలపుట్టుగ గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరయ్యాయి. వీటిని కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీజీకే మూర్తి మృతి ఉద్యమాలకు తీరనిలోటు



వీజీకే మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

టెక్కలి: ఉద్యమ నాయకుడు వీజీకే మూర్తి మృతి ఉద్యమాలకు తీరనిలోటని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వీజీకే మూర్తి సంస్మరణ సభను నిర్వహించారు. ఉగ్యోగ, కార్మిక, ప్రజా ఉద్యమాల్లో మూర్తి అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.షణ్ముఖరావు, కె.కామేశ్వరరావు, పి.ధర్మారావు, ఎస్.దామోదరరావు, హెచ్.ఈశ్వరరావు, యు.లక్ష్మణరావు, కె.ఎల్లయ్య, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన



ఆధార్ స్పెషల్‌డ్రైవ్‌ను పరిశీలిస్తున్న నాగరాణి

కవిటి: ఇచ్ఛాపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాల్లోని 260 కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలందరికీ ఆధార్ నమోదుకు కృషిచేస్తున్నామని సీడీపీవో పురాణం నాగరాణి అన్నారు. బల్లిపుట్టుగలో మంగళవారం నిర్వహించిన ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ఆమె సందర్శించారు. 260 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 10,059 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 8005 మంది ఆధార్ నమోదు పూర్తయిందని అన్నారు. మిగిలిన అన్ని కేంద్రాల పరిధిలో శతశాతం లక్ష్యాల నమోదుకు అంగన్‌వాడీ కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. డిజిటల్ అసిస్టెంట్ బెండి వికాస్ పాల్గొన్నారు.

అమ్మోజీకి తెలుగు తేజం పురస్కార ప్రదానం



అమ్మోజీకి పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

టెక్కలి: వరల్డ్ రైట్స్ ఫోరమ్, వరల్డ్ రైటర్స్ అకాడమి, తెలుగు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సంయుక్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి అవార్డులను ప్రకటించింది. ఇందులో భాగంగా టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన బమ్మిడి అమ్మోజీకి తెలుగుతేజం పురస్కారం వరించింది. ఈ మేరకు మంగళవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఎస్పీ కొండా నరసింహారావు చేతుల మీదుగా అమ్మోజీ పురస్కారాన్ని అందుకున్నారు. సాహిత్య రంగంలో విశిష్ట సేవలతో పాటు సామాజిక కార్యక్రమాలను గుర్తించి అమ్మోజీకు ఈ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో బోయి భీమన్న సాహిత్య నిధి ట్రస్టు చైర్‌పర్సన్ బోయి హైమావతి, కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ కార్యవర్గ సభ్యులు, నన్నయ్య యూనివర్సిటీ వీసీ టి.సత్యన్నారాయణ, హ్యూమన్ రైట్స్ లీగల్ అడ్వైజర్ వై.హేమారావు పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కృష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాసకు చెందిన కవి, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి తెలుగు భాషకు, సాహిత్యానికి చేస్తున్న కృషికి తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారం వరించింది. మంగళవారం విజయవాడలో కౌతా పూర్ణానంద విలాస్ కళావేదికపై జరిగిన కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో దూరదర్శన్ డైరెక్టర్, ఉప డైరెక్టర్ కొండలరావు, నరసింగరావుల చేతులు మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

నవభారత్ యంగ్ అడ్వకేట్స్ ఉమెన్ సెక్రటరీగా సాయిలక్ష్మి



సాయిలక్ష్మి

కాశీబుగ్గ: నవభారత్ యంగ్ అడ్వకేట్స్ యంగ్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉమెన్ జాయింట్ సెక్రటరీగా పలాసకు చెందిన యువ న్యాయవాది తలగాన సాయిలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ స్టూడెంట్ ఫెడరేషన్ అడ్వకేట్ హెచ్‌సీ ఎస్.రుద్రవిద్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. రాష్ట్రంలో మహిళా న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి సహాయకారిగా ఉండేందుకు ఏడాదిపాటు ఈ పదవిలో ఆమె కొనసాగనున్నారు. ప్రస్తుతం సాయిలక్ష్మి విశాఖపట్నం బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొందారు.

వివేకానందుని మార్గం అనుసరణీయం



సోంపేట: కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు



టెక్కలి: వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు



కాశీబుగ్గ: వివేకానంద జయంతి కార్యక్రమంలో స్థానికులు

సోంపేట: స్వామి వివేకానందుడు చూపిన మార్గం నేటి యువతరానికి అనుసరణీయమని రామకృష్ణా సేవాసమితి అధ్యక్షుడు గరుడాచల శంకరరావు అన్నారు. రామకృష్ణా సేవాసమితి మందిరంలో స్వామి వివేకానందుడు పుట్టిన తిథి ప్రకారం 163వ జయంతి ఉత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతినిధులు మలి పెద్ది వేణు, రామకృష్ణ ఉన్నారు.

టెక్కలి: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ట్రిపుల్-ఈ హెచ్‌వోడీ డి.విజయకుమార్, ఎన్ఎస్ఎస్ పీవో ఎస్.వి.మారుతి పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి శారదానగర్ శారదామాత రామకృష్ణాపరమహంస ఆశ్రమమంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం భజన కార్యక్రమంతో ముగించారు. శ్రీవివేకానంద రామకృష్ణ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వీల్ చైర్ వితరణ

కాశీబుగ్గ: మందస మండలం సారంగిపురం గ్రామానికి చెందిన తమ్మినాని జోగారావు కొద్ది నెలలు క్రితం మధుమేహ వ్యాధితో ఒక కాలుని కోల్పోయాడు. సొండిపూడి గ్రామానికి చెందిన మదర్ వలంటీర్ ఆర్గనైజేషన్, గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వీల్ చైర్‌ను సమకూర్చారు. దీన్ని జోగారావుకు మంగళవారం అందజేశారు. గ్రామ పెద్దలు ఉన్నారు.

పారా లీగల్ వలంటీర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

టెక్కలి రూరల్: పారా లీగల్ వలంటీర్ల శిక్షణ కోసం కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు మండలాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు ఫిబ్రవరి ఐదో తేదీలోగా కోటబొమ్మాళి మండల న్యాయసేవాసంఘానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జిల్లా న్యాయసేవాసంఘం సంస్థ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. వీరు గ్రామాల్లో న్యాయ సలహాలు, సూచనలు అందించే విధంగా కార్యక్రమాలు రూపొందించనున్నట్టు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవానికి అర్హులన్నారు. మరిన్ని వివరాలకు మండల న్యాయసేవా సంఘాన్ని సంప్రదించాలన్నారు.

బొడ్డపాడు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2021-22 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాల ఆవరణే వేదికైంది. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో తామాడ సాయి, బొడ్డు రేవతీపతి, మడ్డు లోహిత్, బొడ్డు కామేషు, తెప్పల కపిల్, తెలుకుల హేమంత్, రాజాం డిల్లీరావు, రాజాం శృతి, దున్న సమీరాపాల్గొన్నారు.



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు